తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలి

- జిల్లా ప్రత్యేకాధికారి, ఇంటర్మీడియెట్ కార్యదర్శి శృతిఓఝూ
- తాగునీటి సమస్యపై సంబంధిత అధికారులతో సమీక్ష

గద్వాల, ఏప్రిల్ 8 : జిల్లాలో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శృతిఓఝూ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మిషన్‌భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీవోలతో నీటి సమస్యలపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని విధాలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మిషన్‌భగీరథ ద్వారా జనవాసాలకు ప్రతిరోజూ తాగునీరు సరఫరా అయ్యేలా అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో బోరు మోటర్లు, ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయి అధికారులందరూ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ నీటి సమస్యను గుర్తించి పరిష్కరించాలన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్నట్లు పత్రికల్లో వార్త ప్రచురితమైతే అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో నీటి లభ్యత, తాగునీటి డిమాండ్, పంపిణీ తదితర వివరాలను మిషన్ భగీరథ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పైప్ లైన్ లీకేజీలు ఎక్కడ ఉండొద్దని ప్రభుత్వ బోర్లు, చేతిపంపులు అన్ని మరమ్మతులు చేయించారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకులపై సరైనా మూతలు ఉండే విధంగా, నీటి కాలుష్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ప్రత్యేక అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని బోర్లు మరమ్మతులు చేయించారు వాటి ప్రస్తుత స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా జిల్లాలో బల్క్ వాటర్ సప్లైకు ఎలాంటి సమస్య లేదని జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 255 పంచాయతీలకు అవసరం మేరకు నీటి సరఫరా చేస్తున్నామన్నారు. మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి, మున్సిపాలిటీల్లో ఎంపీవోలు, ఏఈలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారన్నారు. నీటి విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే స్పందిస్తూ జీపీ నిధులతో బోరు మోటర్లు, చేతి పంపులు ఇతర తాగునీటి వనరుల మరమ్మతు పనులు చేపడుతున్నారని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, మిషన్ భగీరథ అధికారులు జగన్‌మోహన్, శ్రీధర్‌రెడ్డి, భీమేశ్వరరావు, డీఆర్‌డీవో నర్సింగరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటరెడ్డి, కమిషనర్లు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి శృతి ఓఝూ, హాజరైన కలెక్టర్ సంతోష్

సమీక్షా సమావేశానికి హాజరైన అధికారులు

చలివేంద్రాలను ఏర్పాటు చేయించాలి

- వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

కమిషనర్లతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, ఏప్రిల్ 8 : జిల్లాలో ఎండల తీవ్రతను బట్టి ఆయా మున్సిపాలిటీల పరిధిలో చలి వేంద్రాలను ఏర్పాటు చేయించాలని మున్సిపాలిటీ కమిషనర్లను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలెక్టర్ సోమవారం జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో తాగునీటి సరఫరా, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లు, జానాలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో చల్లని శుభ్రమైన తాగునీరు అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు నల్లాల ద్వారా సరిపడా తాగునీరు అందించాలని ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉంటే వెంటనే అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకరావాలన్నారు. సమస్యను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అత్యవసరం అయితే తప్పా ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

వనపర్తి, ఏప్రిల్ 8 : ప్రజలు పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరుతూ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ జిల్లా ప్రజలకు పండుగల శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఉగాది, రంజాన్ పండుగలను ఆనందం, సుఖ సంతోషాలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేకాధికారులు ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ ఏఈలతో గ్రామాల్లో తాగునీటి సరఫరాపై వెబ్‌ఎక్స్ ద్వారా సోమవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క గ్రామంలో తాగునీటి సమస్య రావద్దని, ఎఫ్‌డీఎఫ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి తాగునీటి సమస్యను అధిగమించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే లోకల్ బాడీస్ కలెక్టర్ దృష్టికి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- జోగులాంబ గద్వాల ఎస్పీ రితి రాజ్

ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, ఏప్రిల్ 8 : బాధితుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోలీస్ శాఖ పని చేస్తుందని ఎస్పీ రితి రాజ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఏడుగురు బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల సమస్యలను తెలుసుకొని ఆయా పోలీస్ స్టేషన్ అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు.

రూ.2.21లక్షలు సీజ్

గద్వాల అర్బన్, ఏప్రిల్ 8 : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో విస్తృతంగా పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్పీ రితి రాజ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లాలోని కేటీదొడ్డి మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో భాగంగా ఎలాంటి రశీదు లేకుండా తీసుకెళ్తున్న రూ.2,21,000 నగదు పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం పట్టుకున్న నగదును గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు.

బుద్ధారం గండి వద్ద రూ. 64వేలు

గోపాల్‌పేట, ఏప్రిల్ 8 : మండలంలోని బుద్ధారం గండి చెక్‌పోస్టు వద్ద సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు.. బిజినేపల్లి మండలం శాయిని పల్లికి చెందిన వేముల శాంతయ్య కారులో వనపర్తికి వెళ్తుండగా చెక్ పోస్టు వద్ద తనిఖీ చేయగా అతడి వద్ద రూ. 64వేలు లభించినట్లు తెలిపారు. ఈ డబ్బులు సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పాన్‌గల్, ఏప్రిల్ 8: ఎండలు ఎక్కువగా ఉండడంతో వడదెబ్బ తగిలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ రాకేశ్‌రెడ్డి, ఎంపీడీవో కోటేశ్వర్, తాసీల్దార్ శుభాశ్‌నాయుడు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో వడదెబ్బ మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రధానంగా చిన్న పిల్లలు, వృద్ధులు బయటికి రావద్దని సూచించారు. పంటపొలాల్లో పని చేసే రైతులు, రైతు కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏవో సాజిద్ రహెమాన్, డిప్యూటీ తాసీల్దార్ అశోక్‌నాయుడు, కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'నీ ఓటు, నీ భవిష్యత్తు'పై అవగాహన

అచ్యుతాపురంలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వనపర్తి, ఏప్రిల్ 8 : జిల్లాలోని పలు గ్రామాల్లో నీ ఓటు, నీ భవిష్యత్తు అనే అంశంపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాంబాబు తెలిపారు. మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కలెక్టర్, స్వీప్ నోడల్ అధికారుల ఆదేశానుసారం ప్రతి గ్రామంలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఓటు వేసేటప్పుడు జాతి, మతం, కులం, వర్గం భాష వంటి వాటికి ప్రభావితం కాకుండా నిజాయితీతో మంచి వ్యక్తులకు ఓటు వేసి ఎన్నుకోవాలన్నారు. ఓటు హక్కుపై ఎలాంటి సందేహాలున్నా టోల్ ఫ్రీ నెంబర్ 1950కి ఫోన్ చేయాలని సూచించారు. అలాగే సీ విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ కేస్ వర్కర్ రవిరాజు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

ఉగాది పచ్చడి విశిష్టతపై అవగాహన

విద్యార్థులకు పచ్చడిని పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

పెబ్బేరు, ఏప్రిల్ 8 : పెబ్బేరు మండలం రంగాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉగాది పచ్చడి విశిష్టతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. షడ్రుచులతో తయారు చేసే పచ్చడికి ఒక్కో రుచికి ఒక్కో ప్రత్యేకత ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమక్షంలో ఉగాది పచ్చడిని తయారు చేసి ముందస్తుగానే పంపిణీ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కంట్రోల్ రూం ఏర్పాటు

పెబ్బేరు, ఏప్రిల్ 8 : మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు సోమవారం కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ప్రస్తుత వేసవికాలంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు గానూ ఇది పనిచేస్తుంది. ఇందుకు గానూ 9533332326, 9949232367 ఫోన్ నెంబర్లకు ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని, కంట్రోల్ రూం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు సోమవారం ప్రకటనలో తెలిపారు.

వారానికి రెండు బిందెల నీళ్లు

- గట్టులోని 7వ వార్డులో ప్రజల దుస్థితి

గట్టు, ఏప్రిల్ 8 : వారానికి ఓ రోజు..అదీ ఒకటి, రెండు బిందెల నీరు రావడం.. ఇది గట్టు మండలకేంద్రంలోని 7వ వార్డులో ప్రజల దుస్థితి. కాలనీవాసులు నీటి సమస్యను ఎవరికీ చెప్పినా పట్టించుకోకపోవడంతో ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి నర్మద ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సుజాత, శంకరమ్మ, నర్సమ్మ, జయశ్రీ, సుమ మాట్లాడుతూ తాగునీటి సమస్యతో తాము నెలల తరబడి ఇబ్బందులు పడుతున్నామన్నారు. వారం, పదిరోజులకొకసారి నల్లాలు వచ్చినా ఒకటి, రెండు బిందెలు వస్తున్నాయని వాపోయారు. దీంతో చేసేది లేక ఇతర వార్డులకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామన్నారు. కాగా సమస్యను పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి శివ శంకర్ వారికి హామీ ఇచ్చారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

గద్వాల అర్బన్, ఏప్రిల్ 8 : 2024-25 విద్యా సంవత్సరానికి గానూ యూపీఎస్సీ సీఎస్ఏటీ-2025 పరీక్ష కోసం 100మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ప్రసాదరావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని తెలిపారు. రిజర్వేషన్ల ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33శాతం సీట్లు , రిజర్డ్ కేటగిరిలో దివ్యాంగులకు 5శాతం కేటాయిస్తారని తెలిపారు. ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 28వ తేదీన జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మద్యం పట్టివేత

ఉండవెల్లి, ఏప్రిల్ 8: ఎఫ్ఎస్‌టీ టీం తనిఖీలో మద్యం పట్టుకున్న ఘటన సోమవారం చోటుచేసుకున్నది. ఏఎస్సై సుబ్బారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని పుల్లూరుకు చెందిన నరేశ్ మధ్యరాత్రి సోమవారం ఇంటి ముందు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఎఫ్ఎస్‌టీ టీం అధికారులు తనిఖీ చేయగా.. ఆ ఇంట్లో వివిధ కంపెనీలకు చెందిన 41.72లీటర్ల మద్యం ఉన్నట్లు గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ప్రజలకు భగవద్గీత పంపిణీ

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 8 : మండలకేంద్రంలోని మంగళిగేరి నర్సింహాస్వామి ఆలయం వద్ద ఉగాది పండుగ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీత గ్రంథాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు ఆశన్న మాట్లాడుతూ భగవద్గీత జీవితంలో మనిషి ఎలా బతుకాలో నేర్పిస్తుందని, గీత చదవడంతో మన రాత మారుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగంగా భగవద్గీతను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎం.శేఖర్, కార్యదర్శి ప్రసాద్, నాయకులు శ్రీను, శేషయ్య, చిన్న యాదవులు, విక్రం, రాజేశ్, శివ కుమార్, నరహరి ఉన్నారు.

వీరబ్రహ్మంగారి నాటక ప్రదర్శన

గోపాల్‌పేట, ఏప్రిల్ 8 : ఉగాది పండుగ సందర్భంగా ఏదుల మండలకేంద్రంలో గ్రామానికి చెందిన కళాకారులు మూడురోజులపాటు శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి రెండో రోజు వీరబ్రహేంద్రస్వామి, గోవిందమ్మల కల్యాణం, మంగళవారం చివరిరోజు వీరబ్రహ్మంగారి జీవ సమాధి ఉంటుందని మాస్టర్ జనుంపల్లి మాసిరెడ్డి తెలిపారు. 24 మంది కళాకారులు ఆయా పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, ఏప్రిల్ 8 : జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇసుక రవాణా నిర్వహణపై టాస్క్‌ఫోర్స్ అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్, ఎస్పీరితిరాజ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సమన్వయం చేసుకొని ఇసుక సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా కమిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు. సీసీ కెమెరాల నిఘాతో వాహనాల తనిఖీ జరగాలని సూచించారు. జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా పెంచాలని ఆదేశించారు. ఆయా మండలాల పరిధిలో ఇసుక అక్రమ రవాణా జరిగిన వెంటనే తాసీల్దార్లు, ఎస్సైలు వెంటనే స్పందించి అరికట్టాలన్నారు. పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు ప్రతి రోజూ ఇసుక వాహనాలను తనిఖీ చేసి అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. తాసీల్దార్ల పరిధిలో పట్టుకున్న వాహనాలకు తప్పని సరిగా జరిమానా విధించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామచందర్, మైనింగ్ ఏడీ రమణ అధికారులు మోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

గద్వాల అర్బన్,ఏప్రిల్ 8 : ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే సార్వత్రిక ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతు గద్వాలలో మొత్తం ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశామని అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు, ఇతర మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, ఆర్డీవో రాంచందర్, ఇంటర్ నోడల్ అధికారి హృదయరాజు, ఇన్‌చార్జి డీఈవో ఇందిర, డీఎంహెచ్‌వో శశికళ, డీఆర్డీవో నర్సింగరావు, డీపీవో వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

గద్వాల, ఏప్రిల్ 8 : ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ వైద్యాధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను వైద్యాధికారులతో కలిసి సోమవారం అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు, ఇతర సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను ప్రజలకు అందజేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర మందుల కొరత లేకుండా సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. సమావేశంలో డాక్టర్ శశికళ, సుమిత్‌రెడ్డి, అధికారులు నర్సింగరావు, రాంచందర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టిపెట్టాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 8 : విద్యార్థులు ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి పెట్టాలని ఎస్వీఎమ్మార్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎస్ఎస్ రామరావు, ప్రిన్సిపాల్ నాగరాజు అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎంబీ గార్డెన్‌లో ఎస్వీఎమ్మార్ కళాశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని దానికనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, హార్డ్‌వర్క్‌తో చదివితే చిన్న వయసులోనే ఉద్యోగం సంపాదించవచ్చునని అన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అదేవిధంగా వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ చాంద్‌పాషా, చంద్రమౌళి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పూడిక తొలగింపు

అయిజ, ఏప్రిల్ 8: ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పూడిక తొలగింపు పనులు చేపడుతున్నారు. 2022-23 ఏడాదిలోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.36లక్షలు విడుదల చేసి పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించింది. గతేడాది వానలు పుష్కలంగా కురవడంతో మే నెల 15వరకు ప్రధానకాల్వలో నీటి ప్రవాహం ఉండడంతో పూడికతీత, ముళ్ల పొదల తొలగింపు పనులు చేపట్టడంలో ఆలస్యమైంది. పనులు చేపట్టాలని అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయడంతో ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పేరుకుపోయిన పూడిక మట్టి తొలగింపు, ఇరువైపులా ముళ్లపొదల తొలగింపు పనులు ముమ్మరం చేశారు. జూన్ చివరి నాటికి పూడికతీత, ముళ్ల పొదల తొలగింపు, డిస్ట్రిబ్యూటరీ మరమ్మతు వంటి పనులు పూర్తి చేసి వానాకాలంలో పంటలకు సాగునీరు సాఫీగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఎస్ ప్రాజెక్టు ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పూడికతీత పనులతో కాల్వలో సాగునీరు ఎక్కువగా పారేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

కాల్వలో పూడిక తొలగిస్తున్న డోజర్

ఊపందుకున్న ఉపాధి హామీ పనులు

గోపాల్‌పేట, ఏప్రిల్ 8 : గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. ఉపాధి కూలీలతో చెరువులు, పాటుకాల్వల్లో పూడికతీత, భూమి చదును వంటి పనులు జరుగుతున్నాయి. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం 7గంటలకు పని ప్రదేశానికి చేరుకొని మధ్యాహ్నం 12గంటల వరకు పనులు చేస్తున్నారు. పని ప్రదేశాల్లో గ్రామ పంచాయతీ ద్వారా టెంట్లు, నీటి వసతి ఏర్పాటు చేశారు. అదే విధంగా ఏఎన్ఎంల ద్వారా ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచి అందజేస్తున్నారు. గోపాల్‌పేట మండలంలో 11,350 జాబ్ కార్డులు ఉండగా, అందులో 5,249 యాక్టివ్ జాబు కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం 1500మంది కూలీలు పని చేస్తున్నారు. రేవల్లి మండలంలో 6,700 జాబ్ కార్డులు ఉండగా యాక్టివ్ జాబ్ కార్డులు 2,110 కాగా మొత్తం కూలీలు 3088, ప్రస్తుతం 1050 మంది కూలీలు పని చేస్తున్నారు. రోజు వారీగా వీరికి సరాసరి కూలీ రూ. 200 పడుతున్నట్లు ఏపీవోలు నరేందర్, నర్సింహ తెలిపారు. ఫిబ్రవరి 15 వరకు కూలి డబ్బులు క్లియర్ ఉన్నట్లు వారు తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

మున్ననూర్ చెరువులో పూడిక తీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

ఏదుల చెరువులో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

నేడు అంతర్రాష్ట్ర ఓపెన్ కబడ్డీ పోటీలు

అయిజ రూరల్, ఏప్రిల్ 8: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఈడిగోనిపల్లిలో మంగళవారం అంతర్రాష్ట్ర ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీలు రెండు రోజులపాటు కొనసాగుతాయని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.40,016, రెండో బహుమతి రూ.30,016, మూడో బహుమతి రూ.20,016, నాలుగో బహుమతి రూ.10,016, ఐదో బహుమతి రూ.5,016 ఉంటాయని గ్రామస్తులు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9640115146, 9848663380, 9182043054 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

విత్తన విక్రయ దుకాణాలు తనిఖీ

వడ్డేపల్లి, ఏప్రిల్ 8: విత్తన విక్రయ దుకాణాలను వ్యవసాయాధికారి రాధ మంగళవారం తనిఖీ చేశారు. శాంతినగర్‌లోని మన గ్రోమోర్, సంకల్ప , శ్రీరామ, లలిత, కొంకలలోని మాధురి దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ముఖ్యంగా విత్తన దుకాణాల్లో లూజు విత్తనాలు విక్రయించరాదని, బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, స్టాకు వివరాల బోర్డులు ఉంచాలని, ధరల పట్టిక ఉండాలని, రికార్డులు సక్రమంగా ఆన్‌లైన్ చేసి ఉంచాలని ఏవో దుకాణాయజమానులకు సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

లారీ డ్రైవర్‌కు జరిమానా

వడ్డేపల్లి, ఏప్రిల్ 8: మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్ పరిధిలో రోడ్లకిరువైపులా నాటిన హరితహారం మొక్కలను నిర్లక్ష్యంగా లారీతో తొక్కించి నాశనం చేసిన లారీ డ్రైవర్ రామేశ్వర్(ఉత్తర్‌ప్రదేశ్)కు కమిషనర్ ఆదేశాల మేరకు రూ.2వేల జరిమానా విధించామని మున్సిపల్ సిబ్బంది తెలిపారు. మొక్కలను పీకేసినా, చెట్లను నరికినా చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

జర్నలిస్టులందరికీ న్యాయం చేయాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 8 : జర్నలిస్టులందరికీ న్యాయం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బార్ చాంబర్‌లో విలేకరుల సంఘాల ఆధ్వర్యంలో న్యాయమైన సమస్యలకు మద్దతు ఇవ్వాలని బార్ అసోసియేషన్ కార్యవర్గానికి జర్నలిస్ట్‌ల సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డేగల కృష్ణయ్య, జర్నలిస్టుల సంఘాల నాయకులు శ్రీధర్ రావు, మల్లెల బాలస్వామి, రమేశ్, ప్రశాంత్, రవీందర్ రెడ్డి, మాధవరావు ఉన్నారు.

మహనీయులకు నివాళి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 8 : స్వాతంత్ర్య సమరయోధులు మంగళ్‌పాండే, బంకిం చంద్ర చటర్జీ, శంకరంబాడీ సుందరాచార్య, వేములపల్లి శ్రీకృష్ణ వర్ధంతిని సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాశ్ మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కవి పండితుడు గిరిరాజాచారి, వ్యాఖ్యాత నర్సింహశర్మ, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు దేవన్ననాయుడు, నాగరాజు, బాలేమియా, వెంకటస్వామి, పరమేశ్వరాచారి, సత్యంచారి, మాధవాచారి, నాగరాజుచారి, సూర్యనారాయణచారి, రాములు, రామకృష్ణ ఉన్నారు.

మిల్క్‌సెంటర్‌లో చోరీ

అమరచింత, ఏప్రిల్ 8 :పట్టణంలోని మిల్క్ సెంటర్‌లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి రూ.లక్ష నగదును అపహరించిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం ప్రధాన రహదారిపై ఉన్న ఖాజా మిల్క్ సెంటర్ సెంటర్ తాళాలను పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఖాజా ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

మల్దకల్, ఏప్రిల్ 8 : మండలంలోని సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయం వెనుకభాగంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, అలాగే విద్యుత్ లైన్లు ఉండటం వల్ల భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఉంటున్నాయని గ్రామస్తులు వాపోయారు. ఆలయ చైర్మన్ రామకృష్ణ, మాజీ సర్పంచ్ అశోక్ భక్తుల ఇబ్బందులను విద్యుత్ ఏఈ దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఏఈ లైన్‌ఇన్‌స్పెక్టర్ వెంకట్రాములు, విద్యుత్ సిబ్బందితో సోమవారం స్తంభాలను తీయించి, ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోట అమర్చారు. వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులకు చైర్మన్, మాజీ సర్పంచ్, మురళీ కృష్ణ ,గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పాన్‌గల్, ఏప్రిల్ 8: మండలంలోని మల్లాయిపల్లిలో నూతనంగా 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం అధికారులు ఏర్పాటు చేశారు. లోవోల్టేజీ సమస్య ఉందని రైతులు మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు.